సాక్షి నిజామాబాద్

మంగళవారం । 15 । జూలై । 2025



ప్రజావాణికి ప్రాధాన్యం..

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



సూపరింటెండెంట్ బాధ్యతలు..

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా మాల కొండారెడ్డి బాధ్యతలు స్వీకరించ లేదు. ఆయన విముఖంగా ఉన్నట్లు తెలిసింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
37.3 /23.3

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సాగునీటి కాలువ పరిశీలన



నవీపేట : 'గిఫ్ట్ కొంత.. కబ్జా మరింత' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రంలో కబ్జాకు గురవుతున్న సాగు నీటి కాలువను తహసీల్దార్ వెంకటరమణ, ఇరిగేషన్ ఏ ఈ శ్రీధర్ సోమవారం పరిశీలించారు. సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని సర్వేయర్ గోవర్ధన్‌ను తహసీల్దార్ ఆదేశించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తే కేసులు నమోదవుతాయని హెచ్చరించారు.

జాతీయ అవార్డుల దరఖాస్తుకు గడువు పొడిగింపు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు 2025 జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలీస్ ప్రజావాణికి 26 ఫిర్యాదులు



ఖలీల్‌వాడి: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సీపీ సాయి చైతన్య సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత ఎస్సై, సీఐలను ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలన్నారు. పోలీస్ ప్రజావాణికి మొత్తం 26 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో ప్రాజెక్ట్‌లోకి 2,172 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 359 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1068.70(21.2 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. గతేడాది ఇదే రోజున 1062.2 (12.90టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

ఆపరేషన్ టైగర్!

ఉమ్మడి జిల్లా సరిహద్దుల్లో సంచరిస్తున్న పులి జాడ కనుక్కోవడం కోసం అటవీ అధికారులు గాలింపు కొనసాగిస్తున్నారు. రెండు రోజులైనా పులి ఎక్కడుంది, ఎటు వెళ్లిందన్నదానిపై స్పష్టత లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ఎస్ 12 పులి కోసం కొనసాగుతున్న గాలింపు

- అడవిలో ఆరు ట్రాక్ కెమెరాలు ఏర్పాటు
- రెండు డ్రోన్ కెమెరాలతో కదలికలు కనిపెట్టే ప్రయత్నం
- ఎటువైపు వెళ్లిందన్న దానిపై స్పష్టత కరువు
- పులిపై విష ప్రయోగానికి ప్రయత్నించిన నలుగురిపై కేసు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉమ్మడి జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులి కోసం అటవీ శాఖ ఆపరేషన్ కొనసాగుతోంది. జిల్లా అటవీ అధికారి నిఖిత ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని మాచారెడ్డి, కామారెడ్డి, సిరికొండ, ఇందల్వాయి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట రేంజ్‌లకు చెందిన అటవీ అధికారులు, సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. మూడు బృందాలుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. రామారెడ్డి, మాచారెడ్డి మండలాల పరిధిలోని రెడ్డిపేట, అన్నారం, ఎల్లంపేట, సిరికొండ మండలంలోని కొండాపూర్, తూంపలి తదితర గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాలలో గాలిస్తున్నారు.

ఆరు ట్రాక్ కెమెరాల ఏర్పాటు

పులి కదలికలను కనిపెట్టేందుకు అటవీ ప్రాంతంలో ఆరు ట్రాక్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి తిరిగిన ప్రదేశానికి రెండు కిలోమీటర్ల రేడియస్‌లో అన్నివైపులా కవరయ్యేలా కెమెరాలు బిగించినట్లు సమాచారం. ఆ ప్రాంతంలో పులి ఉంటే కచ్చితంగా కెమెరాలు ట్రాక్ చేస్తాయని అధికారులు చెబుతున్నారు. అలాగే రెండు డ్రోన్ కెమెరాలతో అడవిలో తిరుగుతూ పులి జాడ కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి దాటే దాకా గాలింపు కొనసాగింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు సిబ్బంది అటవీ ప్రాంతంలోనే ఉండి పులి జాడ కోసం ప్రయత్నించారు.

అదుపులో ముగ్గురు!

రెడ్డిపేట స్కూల్ తండా పరిధిలోని అటవీ ప్రాంతంలో ఇటీవల ఆవుపై పులి దాడి చేసి చంపేసింది. అయితే ఆవు యజమానితో పాటు మరో ముగ్గురు ఆవుపై పురుగుమందులు చల్లి పులిని మట్టుబెట్టే ప్రయత్నం చేశారని అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు.

ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. విషప్రయోగం నిర్ధారణ కోసం శాంపిళ్లను సేకరించి ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు.

రాత్రింబవళ్లు రెస్క్యూ ఆపరేషన్..

ఎస్ 12 నంబరుతో పిలవబడే పులి ఇటీవల జిల్లా సరిహద్దుల్లోని సిరికొండ, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో తిరిగి నట్టు అటవీ అధికారులు నిర్ధారణకు వచ్చారు. పులి కదలికలను తెలుసుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. దాని జాడ కనిపెట్టేందుకు మాచారెడ్డి, ఇందల్వాయి, కామారెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, సిరికొండ రేంజీలకు చెందిన అటవీ అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. పులి కదలికలను గుర్తించే క్రమంలో అడవిని జల్లెడ పడుతున్నారు. సోమవారం జిల్లా అటవీ అధికారి నిఖిత కూడా అటవీ ప్రాంతానికి వెళ్లి రెస్క్యూ ఆపరేషన్‌ను పరిశీలించారు. డ్రోన్ కెమెరాల ద్వారా పులి కదలికలను తెలుసుకునే ప్రయత్నం చేశారు.



పులి జాడ కోసం వెతుకుతున్న అటవీ సిబ్బంది

రెస్క్యూ ఆపరేషన్‌కు ఇబ్బందులు



వర్షాకాలం కావడంతో అడవి పచ్చబడింది. ముళ్ల పొదలు, చెట్లు పెరిగి అడవిలో తిరగడానికి అటవీ అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పులిని గుర్తించడం కూడా ఇబ్బందికరంగా మారింది. ఎస్ 12 పులిని కాపాడేందుకు ప్రత్యేక బృందాలు అడవుల్లో తిరుగుతూ దాని కదలికలను పసిగట్టేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. పులి ఏ వైపు వెళ్లింది అన్నదానిపై క్లారిటీ రావాల్సి ఉంది. నాలుగైదు దశాబ్దాలుగా జిల్లాలో పులుల సంచారం లేదు. ఇప్పుడు వచ్చిన పులిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రజలు అటవీ ప్రాంతానికి వెళ్లొద్దు. పులిపై విష ప్రయోగం జరిగిందా లేదా అనేది ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక వచ్చాకే చెప్పగలం.

– నిఖిత, డీఎఫ్‌వో, కామారెడ్డి

పెద్దపులి మొదట వచ్చింది సిరికొండకే..

- నిర్ధారించిన అటవీ శాఖ అధికారులు
- ఇందల్వాయి, నిజామాబాద్ సౌత్ రేంజ్‌లలోనూ అప్రమత్తం

డొంకేశ్వర్(ఆర్మూర్): కామారెడ్డి జిల్లా మాచారెడ్డి రేంజ్ పరిధిలో ఆవుపై దాడిచేసి చంపిన పెద్దపులి మొదటగా నిజామాబాద్ జిల్లా సిరికొండ రేంజ్‌కే వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. ఇప్పటికే తాటిపల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి పాద ముద్రలను గుర్తించిన విషయం తెలిసిందే. తాటిపల్లి అటవీలోనే కొన్ని రోజులు పెద్దపులి సంచరించి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కొండలు, రాళ్ల గుట్టలు ఎక్కువగా ఉండడంతో మాచారెడ్డి అటవీ ప్రాంతం వైపు వెళ్లినట్లు భావిస్తున్నారు. అయితే మాచారెడ్డి రేంజ్‌లో పెద్దపులిపై విష ప్రయోగం జరిగిందన్న వార్తలు రావడం, పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో నిజామాబాద్ జిల్లాలో కూడా హాట్ టాపిక్‌గా మారింది. పెద్ద పులి మళ్లీ నిజామాబాద్ జిల్లా వైపు రావొచ్చనే సందేహంతో సిరికొండ, ఇందల్వాయి, నిజామాబాద్ సౌత్ రేంజ్‌లను అప్రమత్తం చేశారు. అటవీ పరిసర గ్రామాల ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పెద్దపులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని, ఉచ్చులు, విద్యుత్ తీగలు పెట్టకూడదని అధికారులు సూచిస్తున్నారు. అదే విధంగా నిజామాబాద్ నాగారంలో చిరుత సంచారం నేపథ్యంలో అన్ని రేంజ్‌లలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలిచ్చారు.



పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది

మొక్కజొన్న జాతర

- అంకాపూర్ నుంచి మార్కెట్‌కు తరలివస్తున్న పచ్చి మక్కకంకులు
- ట్రాలీ ఆటో నింపుకోవాలంటే రూ.10వేలు
- ఏపీ, మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి వస్తున్న వ్యాపారులు
- డజన్ ధర రూ.60 నుంచి రూ.100
- కాల్చిన మక్కెన రూ.20..



అంకాపూర్ మార్కెట్‌లో మొక్కజొన్న కుప్పలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వరి, పసుపు తరువాత జిల్లాలో మొక్కజొన్న సాగు ప్రత్యేకం. పలు ప్రాంతాల్లో తల్లిపంటగా భావించే పసుపులోనూ అంతరపంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. పంట చేతికొచ్చే సీజన్ కావడంతో మార్కెట్‌లో మక్క కంకుల వ్యాపారం జోరుగా సాగుతోంది. మొక్కజొన్న సాగు, మార్కెట్‌కు పెట్టింది పేరైన అంకాపూర్‌లో ప్రస్తుతం మక్కల జాతర నడుస్తోంది. సీజన్ పూర్తయ్యే వరకు ఈ గ్రామంలో మొక్కజొన్నల అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగాసాగుతాయి. ఇక్కడ డజన్ పచ్చి కంకుల ధర రూ.60 నుంచి రూ.100 పలుకుతోంది. సీజన్ మొదట్లో ట్రాలీ ఆటో మక్కల ధర రూ.3వేలు మాత్రమే పలకగా, ప్రస్తుతం రూ.10 వేలకు పెరిగింది. కాల్చిన ఒక్కో కంకిని మాత్రం రూ.20కి విక్రయిస్తున్నారు. ప్రారంభంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రోహిణి కార్తెలో విత్తుకున్న మొక్కజొన్నల దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడంతో అమ్మకాలు మందకొడిగా ప్రారంభమయ్యాయి. ధర పెరిగినప్పటికీ డిమాండ్ పెరుగుతుండడం గమనార్హం. దీంతో అంకాపూర్ మార్కెట్ అమ్మకందారులు, కొనుగోలుదార్లతో కళకళలాడుతోంది. మరిన్నిరోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తుండటంతో మొక్కజొన్న రైతులు పచ్చి కంకులనే అమ్ముకునేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. వర్షాల కారణంగా మొక్కజొన్న కంకులను ఎండబెట్టడం శ్రమతో కూడుకున్న పని కావడంతో రైతులు పచ్చి కంకులనే అమ్ముకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆర్మూర్ పట్టణం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే దారిలో 63వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకొని మార్కెట్ ఉండటంతో దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు వాహనాలను ఇక్కడ ఆపి మొక్కజొన్న కంకులను కొనుగోలు చేస్తున్నారు. కాగా ఆర్మూర్ ప్రాంతంలోని గ్రామాలకు చెందిన రైతులు పండించిన మక్కలను మధ్య దళారులు ముందుగానే కొనుగోలు చేస్తారు. అలాగే రైతులు నేరుగా ఆటో ట్రాలీల్లో పచ్చి మక్కెనలను అంకాపూర్ మార్కెట్‌కు తరలించి రోడ్డు పక్కన కుప్పలుగా పోసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఎకరం భూమిలో తొమ్మిది నుంచి పది ట్రాలీ ఆటోల్లో నింపే మొక్కజొన్నలు పండుతాయి. మక్కెన సైజును బట్టి ఒక్కో ఆటో ట్రాలీని రైతుల నుంచి మధ్య దళారులు కొనుగోలు చేస్తున్నారు. అంకాపూర్ మార్కెట్‌కు చుట్టుపక్కల జిల్లాలతోపాటు హైదరాబాద్, నాగ్‌పూర్, నాందేడ్, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం వచ్చి వ్యాపారులు మక్కకంకులు కొనుక్కుని వెళుతున్నారు.



ట్రాలీ ఆటోల్లో లోడ్ అయిన మొక్కజొన్న కంకులు

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి
- మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మహిళా సాధికారత సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా పథకాలను అమలు చేస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి అన్నారు. ఇందిరా మహిళాశక్తి సంబరాలను నగరశివారులోని బోర్గాం(పి)లో ఉన్న భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డితో కలిసి మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, లోన్ బీమా, బాధిత కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు వారి పేరిట మంజూరు చేస్తున్నామని, రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభు త్వం ఏటా రూ.25 వేల కోట్ల చొప్పున నాలుగేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తుందని వివరించారు. కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 20,547 మహిళా సంఘాలకు రూ.21.69 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేయగా, రూరల్ నియోజకవర్గంలోని 5781 మహిళా సంఘాలకు రూ.5.91 కోట్ల రుణాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వేడుకల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సొసైటీల చైర్మన్లు, జిల్లా, మండల మహిళా సమాఖ్యల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పుష్కర కాలం తర్వాత..

- రేపు తెయూలో స్నాతకోత్సవం
- చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక
- పాల్గొననున్న కలెక్టర్, సీపీ

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రం పేరుతో ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీలో గత పుష్కర కాలంగా (12 ఏళ్లుగా) విద్యార్థులు, అధ్యాపకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రెండో స్నాతకోత్సవాన్ని (కాన్వొకేషన్) బుధవారం నిర్వహించనున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానుండగా, ముఖ్య అతిథిగా ఐఐసీటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీవారి చంద్రశేఖర్ పాల్గొంటారు. కాన్వొకేషన్ కోసం వర్సిటీ ఉన్నతాధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏడాదికోసారి కాన్వొకేషన్ నిర్వహించాలని యూజీసీ నిబంధనలు చెబుతున్నాయి. 2006లో తెలంగాణ యూనివర్సిటీ ఏర్పడగా తొలి కాన్వొకేషన్‌ను 13 నవంబర్ 2013లో అప్పటి వీసీ అక్బర్ అలీఖాన్ హయాంలో నిర్వహించారు. ఆ తర్వాత కాన్వొకేషన్ నిర్వహణను మరిచారు. 2018, 2020లో కాన్వొకేషన్ నిర్వహణకు అప్పటి వీసీలు సాంబయ్య, రవీందర్‌గుప్తా నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్వహించలేకపోయారు. అయితే గతేడాది అక్టోబర్‌లో వీసీగా బాధ్యత లు స్వీకరించిన యాదగిరి రావు కాన్వొకేషన్ నిర్వహణకు తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ అయ్యింది.



హైదరాబాద్ నుంచి జర్మన్ హ్యాంకర్

వర్సిటీ క్రీడామైదానంలో కాన్వొకేషన్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వానాకాలం కావడంతో వర్షం, ఈదురు గాలులు వస్తే కార్యక్రమ నిర్వహణకు ఆటంకాలు కలగకుండా హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా జర్మన్ హ్యాంకర్‌ను తెప్పించారు. ఇందులో 500 మంది కూర్చునేందుకు వీలుండగా, రూ.9లక్షలు ఖర్చు చేస్తున్నారు. క్యాంపస్‌లోని రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. సూచిక బోర్డులతోపాటు పరిపాలనా భవనానికి వెళ్లే దారిలో 'ఐలవ్ టీయూ' పేరుతో శాశ్వత సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. అన్ని బోర్డుల వద్ద లాన్స్ ఏర్పాటు చేస్తున్నారు. రాజ్ భవన్ కార్యాలయం ప్రోటోకాల్ ప్రకారం స్టేజీపై రాష్ట్ర గవర్నర్, ముఖ్యఅతిథి, వీసీ, రిజిస్ట్రార్‌తోపాటు ఏడుగురు డీన్స్ మాత్రమే కూర్చునే అవకాశం ఉంటుంది. విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోనికి అనుమతిస్తారు. సెల్‌ఫోన్లు, బ్యానర్లు, పేపర్లు తీసుకెళ్లే వీలుండదు. పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు.

గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు

తెయూ పరిధిలో 2014 నుంచి 2023 వరకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ)లో 15,557 మంది విద్యార్థులు, గ్రాడ్యుయేషన్ (యూజీ) లో 60,660 మంది విద్యార్థులు, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) లో 10,079 మంది విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేశారు.

రూ.33.80 లక్షల విరాళం

వర్సిటీలో నిర్వహించే అతి పెద్ద పండుగ కాన్వొకేషన్. యూజీ, పీజీ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా బంగారు పతకాలు (గోల్డ్ మెడల్స్) అందజేసి సత్కరిస్తారు. పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించిన వారికి అధికారికంగా పట్టాలు అందజేస్తారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖులు, విద్యా సంస్థల అధిపతులు, స్వచ్ఛంద సేవకులు, రాజకీయ నేతలు, వివిధ రంగాల వారు గోల్డ్ మెడల్స్ కోసం వర్సిటీకి రూ.33.80 లక్షలు విరాళం ఇచ్చారు.

ఆ డబ్బును వర్సిటీ ఉన్నతాధికారులు బ్యాంకులో డిపాజిట్ చేశారు. డిపాజిట్ మొత్తంపై వడ్డీ రూపంలో వచ్చే డబ్బులతో విద్యార్థుల అందజేసేందుకు 130 బంగారు పతకాలు తయారు చేయించారు. గోల్డ్ మెడల్స్, పీహెచ్‌డీ పట్టాలను మాత్రమే గవర్నర్, ముఖ్యఅతిథి చేతుల మీదుగా అందజేస్తారు.

బెటాలియన్‌లో గార్డ్ ఆఫ్ హానర్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముందుగా డిచ్‌పల్లిలోని టీజీఎస్పీ ఏడో బెటాలియన్‌కు చేరుకుంటారు. గెస్ట్ హౌజ్ వద్ద 104 మంది పోలీసు సిబ్బందితో గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) స్వీకరిస్తారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత తెయూకు చేరుకుని వర్సిటీలో సైతం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య కాన్వొకేషన్‌కు హాజరు కానున్నారు. వర్సిటీలో ఏర్పాట్లను వీసీ, రిజిస్ట్రార్‌లతో కలిసి నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి సోమవారం పరిశీలించారు.

ఆరు విభాగాలతో ప్రారంభమై..

2006లో ఆరు విభాగాలతో ప్రారంభమైన యూనివర్సిటీ ప్రస్తుతం 24 విభాగాల్లో 31 కోర్సులకు విస్తరించింది. డిచ్‌పల్లిలోని ప్రధాన క్యాంపస్‌తోపాటు కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లోని సౌత్‌క్యాంపస్, నిజామాబాద్ నగరంలోని సారంగపూర్‌లో ఎడ్యుకేషన్ క్యాంపస్ కొనసాగుతున్నాయి.ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో 109 అనుబంధ యూజీ, పీజీ కళాశాలలు ఉండగా, 31 కోర్సులకుగాను 19 అప్రూవ్డ్ రెగ్యులర్ కోర్సులు, 12 సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు, 7 పీహెచ్‌డీ కోర్సులు ఉన్నాయి.

అందరి సహకారంతో..

- కార్యక్రమ విజయవంతానికి కృషి చేస్తున్నాం
- వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ యాదగిరిరావు



మాట్లాడుతున్న వీసీ యాదగిరిరావు, పక్కన రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులందరి సహకారంతో ఈనెల 16న నిర్వహించనున్న తెలంగాణ యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవాన్ని (కాన్వొకేషన్)ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని వైస్ చాన్స్‌లర్ టీ.యాదగిరిరావు అన్నారు. వర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ సెమినార్ హాలులో సోమవారం ఆయన రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, కంట్రోలర్ కే.సంపత్‌కుమార్‌తో కలిసి వీసీ మాట్లాడారు. 16 విభాగాల నుంచి మొదటి ర్యాంకు పొందిన 130 మంది విద్యార్థులకు 16 మంది దాతల సహకారంతో కాన్వొకేషన్‌లో గోల్డ్ మెడల్స్ అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే 30 జూన్ 2025 వరకు ఏడు విభాగాల్లో 250 మంది పరిశోధనలు పూర్తి చేశారని, వారిలో 157 మందికి పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టాలు అందజేస్తామన్నారు. ముఖ్యఅతిథిగా ఐఐసీటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీవారి చంద్రశేఖర్ హాజరువుతారని తెలిపారు. ఆయా కమిటీల కన్వీనర్లు, ప్రొఫెసర్లు ఘంటా చంద్రశేఖర్, కనకయ్య, అపర్ణ, ఆరతి, రాంబాబు, ఆంజనేయులు, రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల,అసోసియేట్ ప్రొఫెసర్ నాగరాజు, పీఆర్‌వో ఏ పున్నయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి



వేల్పూర్: గ్రామాలలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలోని పెద్దమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన వనమహోత్సవంలో మొక్కలు నాటారు. వర్షాలు కురవాలన్నా, వాతావరణం సమతుల్యంగా ఉండాలన్నా మొక్కలు పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో సాయిలు, కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, టక్కర్ గంగాధర్, గట్టువుతల నర్సారెడ్డి, భోజన్న, చక్రపాణి, ఈజీఎస్ ఏపీవో అశోక్, జీపీ కార్యదర్శి నవనీత తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు

నిజామాబాద్‌అర్బన్: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం చేపడుతున్నట్లు ఆర్‌సీవో సత్యనాథ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు సంబంధిత సబ్జెక్టుల్లో బీఈడీ, కళాశాలలో బోధించేందుకు పీజీ, బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. బాలికల పాఠశాల/కళాశాలలో పనిచేసేందుకు కేవలం మహిళ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి ధర్మారంలోని మహాత్మా జ్యోతిబా పూలే (అర్బన్ బాయ్స్) పాఠశాలలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. పాఠశాలలో బోధనకు ఇంగ్లిష్ జనరల్‌లో ఒకటి, బాలికల విభాగంలో రెండు, బయోసైన్స్‌లో ఒకటి, ఫిజికల్ సైన్స్‌లో ఐదు, సోషల్ స్టడీస్(బాలికలు) మూడు, హిందీ జనరల్‌లో ఒకటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. కళాశాలలో ఫిజిక్స్(బాలికలు) ఒకటి, కెమిస్ట్రీలో ఒకటి, బాటనీలో ఒకటి, సివిక్స్, ఎకనామిక్స్‌లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

సీనియర్ న్యాయవాది లింబాగౌడ్ మృతికి సంతాపం



నిజామాబాద్ లీగల్: సీనియర్ న్యాయవాది, నిజామాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లింబాగౌడ్ ఆదివారం మృతి చెందారు. దీంతో నగరంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం బార్ సభ్యులు, న్యాయవాదులు లింబాగౌడ్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల సాయి రెడ్డి, మాణిక్ రాజ్ తదితరులు ఉన్నారు. అంతకుముందు జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి లింబాగౌడ్ మృతిపై సంతాపం తెలిపారు.

ఒకటికి ఓర్చుకోవాల్సిందే..

- కాలకృత్యాలకు ఇంటికి పరుగెత్తాల్సిన దుస్థితి
- వసతుల్లేక తగ్గుతున్న విద్యార్థులు
- ప్రతికూల పరిస్థితుల్లో ప్రభుత్వ బడులు
- ఆర్మూర్ నియోజకవర్గంలో టాయిలెట్లు లేక ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు



ఆర్మూర్ పట్టణం జిరాయత్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలమైన టాయిలెట్లు

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. పలు బడుల్లో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్మూర్ పట్టణం జిరాయత్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (చిప్ప స్కూల్)లో విద్యార్థులు ఒకటికి వెళ్లాలంటే శిథిలమైన టాయిలెట్ల గోడ వెనకకు, రెండుకు వెళ్లాలంటే మాత్రం ఇంటికి పరుగెత్తాల్సిందే. మన ఊరు–మన బడిలో నిధులు మంజూరైనప్పటికీ పనులు అర్థంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాల ప్రాంగణంలో తెలుగు, ఉర్దూ మీడియం కలిపి 120 మంది విద్యార్థులుండగా అందులో బాలికలే 80 మంది ఉన్నారు. బాలికలు గోడ వెనకకు వెళ్లలేక ఇంటికి వెళ్లే వరకు ఓర్చుకుంటూ దయనీయంగా తరగతులకు హాజరవుతున్నారు. ఈ పాఠశాలలో 8 మంది ఉపాధ్యాయులు ఉండగా వారిలో నలుగురు మహిళా ఉపాధ్యాయులకు మాత్రం ఒక టాయిలెట్ అందుబాటులో ఉంది. ఆలూరు మండలం గగ్గుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో వెనక్కి వెళ్లాయి. మూత్రశాలలకు నీటి సరఫరా సౌకర్యం లేకపోవడంతో స్కావెంజర్ దూరం నుంచి నీటిని మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

నలుగురు విద్యార్థులతో మాందాపూర్ బడి

మాక్లూర్ మండలం మాందాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 8 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో ఒక ఉపాధ్యాయుడిని గొట్టుముక్కలకు డిప్యుటేషన్‌పై పంపించారు. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఒకటో తరగతిలో ముగ్గురు, రెండో తరగతిలో ఆరుగురు, మూడులో ఎనిమిది, నాలుగులో ముగ్గురు, ఐదో తరగతిలో పది మంది చదువుతున్నారు.



మాక్లూర్ మండలం మాందాపూర్‌లో నలుగురు విద్యార్థులతో కొనసాగుతున్న పాఠశాల

వసతులు లేకనే ప్రయివేటుకు..

నందిపేట మండలంలోని మాయాపూర్ ప్రాథమిక పాఠశాలకు రెండేళ్లుగా విద్యార్థులు రావడం లేదు. మొదట్లో 30 మంది వరకు విద్యార్థులుండగా వారంతా ప్రయివేటు బడులకు వెళ్తున్నారు. ఈ సంవత్సరం బడిబాటలో భాగంగా అధికారులు తల్లిదండ్రులను ఒప్పించడంతో ఏడుగురు విద్యార్థులు చేరారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీ వసతులు లేకపోవడంతోనే పిల్లలను ప్రభుత్వ బడికి పంపడం లేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.



నందిపేట మండలం మాయాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు విద్యార్థులతో టీచర్

ఇంటికి వెళ్తున్నాం..



ఒకటికి అయితే గోడ వెనకకే వెళ్తున్నాం. రెండుకు అయితే మాత్రం టీచర్‌ను అడిగి ఇంటికి వెళ్లి వస్తున్నా. చాలా ఇబ్బందిగా ఉంది. మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలి.

– పూజ, విద్యార్థిని, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిరాయత్‌నగర్, ఆర్మూర్

మాజీ ఎంపీటీసీపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: అట్రాసిటీ కేసు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్న సిరికొండ మండలం కొండాపూర్ మాజీ ఎంపీటీసీ చందర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీ సాయి చైతన్యకు బాధితులు ఫిర్యాదు చేశారు. కొండాపూర్ గ్రామానికి చెందిన గున్నాల మురళీగౌడ్, భార్య సుజాత, కొడుకు భార్గవ్ గౌడ్‌తో కలిసి పోలీస్ ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ హయాంలో తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిపై కన్నేసిన కొండాపూర్ మాజీ ఎంపీటీసీ బీఆర్‌ఎస్ హయాంలో పలుకుబడిని ఉపయోగించి ఆక్రమించుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేసేందుకు ప్రయత్నం చేశారన్నారని ఆరోపించారు. పాత, కొత్త పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ తమను భూమి వైపు వెళ్లకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. రైతుబంధు రాకుండా చేశారని, మాజీ ఎంపీటీసీ ఆక్రమించుకున్న విషయం తెలిసి కుటుంబసభ్యులతో అక్కడికి వెళ్తే తమపై దాడి చేయడమే కాకుండా అట్రాసిటీ కేసు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలుగా కేసు గురించి కోర్టు చుట్టూ తిరుగుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. మాజీ ఎంపీటీసీతో ప్రాణభయం ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలన్నారు. తమ ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించిన సీపీ విచారణ జరిపించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇదే విషయమై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.

కాన్వొకేషన్‌కు రండి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించనున్న కాన్వొకేషన్‌కు హాజరుకావాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు ఆహ్వానించారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయానికి వెళ్లిన వీసీ, సీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు ఏడీఈ టౌన్–1 ఆర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక్‌నగర్‌లో 33కేవీ కొత్త టవర్ నిర్మాణం కోసం కరెంట్ కోత విధించనున్నట్లు తెలిపారు. దీంతో మహాలక్ష్మీ ఫీడర్ పరిధిలోని అమ్మ వెంచర్, న్యూ హౌసింగ్ బోర్డు, ఆర్యనగర్ (కొంతభాగం), ఎల్‌జీ స్విమ్మింగ్ పూల్, బ్యాంకు కాలనీ, బస్వా గార్డెన్, తుల్జా భవానీ, గూడెం ప్రాంతాల్లో నేడు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు చేయాలి

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



శిక్షణ పొందుతున్న బీఎల్‌వోలతో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

రుద్రూర్: ఓటర్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని సమీకృత కార్యాలయ భవనంలో సోమవారం చందూర్, రుద్రూర్ బీఎల్‌వోలతో నిర్వహించిన శిక్షణను పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. తప్పులు సరిచేయడంతోపాటు డబుల్ ఓట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్ నాయక్, చందూర్ ఉప తహసీల్దార్ ఆసియా ఫాతిమా, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఒంటి చేత్తో నిర్మించిన నల్లూరి గుమిటి

మీకు తెలుసా?



నల్లూరి గుమిటి

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో పాక్షికంగా ముంపునకు గురైన నల్లూర్ గ్రామ శివారులోని నల్లూరి గుమిటి ఒంటో చేత్తో నిర్మించినదిగా ప్రసిద్ధి చెందినది.

- నల్లూర్ గుమిటి, న్యావనంది తూం, కస్బా(బినోలా) నంది, నీల కంఠేశ్వరా ఆలయాన్ని ఒకరే ఒంటి చేత్తో నిర్మించినట్లు చరిత్రకారులు చెప్తున్నారు.
- నల్లూర్ శివారులోని దర్గా నల్లూర్ గుమిటిగా ప్రసిద్ధి చెందినది.
- ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ నిర్మాణం ఈ ప్రాంతం నుంచే చేపట్టేవారని, కానీ గుమిటి ఉండటంతో నిర్మాణం నిలిపివేసినట్లు గ్రామస్తులు చెప్తున్నారు.
- ప్రస్తుతం లక్ష్మి కాలువ నీటి సరఫరా కోసం గుమిటికి ఎదురుగా ప్రాజెక్ట్‌లో లక్ష్మి ఎత్తిపోతల పథకం నిర్మించారు.
- నల్లూర్ గుమిటి వద్ద ప్రతి శుక్ర, సోమవారాల్లో భక్తులు అత్యధికంగా పూజలు నిర్వహిస్తారు.

– బాల్కొండ

జీజీహెచ్ సూపరింటెండెంట్ బాధ్యతలు స్వీకరించేనా?

- ప్రభుత్వం బాధ్యతలు అప్పగించినా ఇప్పటికీ విధుల్లో చేరని వైనం
- పెద్ద దవాఖానాకు రెగ్యులర్ సూపరింటెండెంట్ రాక కలేనా..
- 12 ఏళ్లుగా ఇన్‌చార్జీల పాలనే దిక్కు



నిజామాబాద్‌నాగారం: పదవీ విరమణ వయస్సులో కొత్త బాధ్యతలు ఎందుకు..? ఉన్నపళంగా హైదరాబాద్‌ను వదిలి వేరే జిల్లాకు వదిలి వెళ్లడం ఎందుకు? అనుకుంటున్నారో ఏమో తెలియదు కానీ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా మాల కొండారెడ్డి ఇప్పటికీ విధుల్లో చేరలేదు. అసలు ఆయన వస్తారా? రారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. నిజామాబాద్ జిల్లా కేంద్ర జనరల్ ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా మాల కొండారెడ్డిని ప్రభుత్వం నియమించింది. అయితే ఆయన హైదరాబాద్ నుంచి ఇక్కడికి రావడానికి విముఖత చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. పదవీ విరమణ వయస్సు, హైదరాబాద్‌ను వదిలి వెళ్లడం ఇష్టం లేని ఆయన కోర్టుకు వెళ్లినట్లు తెలిసింది.

ఏళ్లుగా ఇన్‌చార్జీలే..

ప్రభుత్వం ఆదేశించినా మాల కొండారెడ్డి విధుల్లో చేరకపోవడంతో జీజీహెచ్‌కు మళ్లీ ఇన్‌చార్జి పాలనకే దిక్కయ్యేలా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. గత 12 ఏళ్లలో డాక్టర్ వాలీయాను మాత్రమే ప్రభుత్వం సూపరింటెండెంట్‌గా నియమించినా ఆయన ఇటువైపు కన్నెత్తి చూడలేదు. జిల్లా ఆస్పత్రి జీజీహెచ్‌గా మారిన నాటి నుంచి ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు. దూరం కారణంగా సూపరింటెండెంట్‌లుగా హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చేందుకు భయపడుతున్నారని, అక్కడి చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కళాశాలల్లో పోస్టింగ్‌లను ఇష్టపడుతున్నారని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించడం కత్తి మీద సాము అని, దీంతో రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా జిల్లాకు రావడానికి భయపడుతున్నారని పలువురు అంటున్నారు.

సెలవుల్లో ఇన్‌చార్జి సూపరింటెండెంట్

జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ వ్యక్తిగత పనుల నిమిత్తం 10 రోజులు సెల వులో వెళ్లారు. ఆర్థో ప్రొఫెసర్ డాక్టర్ రాములు ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.

ప్రజావాణికి ప్రాధాన్యమివ్వాలి

- అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్
- 94 ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 94 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్లతోపాటు మెప్మా పీడీ రాజేందర్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్‌లకు విన్నవించారు.

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉచిత బస్సు సౌకర్యంతో విద్యార్థులకు మేలు కలుగుతుందని, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మహిపాల్, సుమన్, ప్రేమ్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నగరంలోని ఆర్టీసీ– 2 డిపోకు రూ.2కోట్ల మేర నష్టం కలిగించిన మున్సిపల్, విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని న్యాల్‌కల్ రోడ్‌కు చెందిన స్థానికులు పలువురు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ డిపోకు 33/11 కేవీ విద్యుత్ లైన్‌ను ప్రైవేటు ప్లాట్ల స్థలాల గుండా వేయిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రధాన రోడ్డు గుండా వేయాల్సిన లైన్‌ను ప్లాట్ల గుండా వేసి ప్రజాధనం రూ.2కోట్లు వృథా చేశారన్నారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



విద్యార్థినులకు క్యూఆర్ కోడ్‌లను అందజేస్తున్న షీ టీం సిబ్బంది

పెర్కిట్/బోధన్ టౌన్ : మహిళలు, విద్యార్థినులపై ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని షీ టీం సభ్యులు విఘ్నేష్, సుమతి తెలిపారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం షీ టీం ఆధ్వర్యంలో నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు మాట్లాడుతూ పోకిరీల వేధింపులకు గురైన వారు షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్, ట్రాఫిక్‌పై అవగాహన, యాంటీ ర్యాగింగ్, సైబర్ నేరాలపై బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ అవగాహన కల్పించారు. బాధితులు షీ టీం నెంబరు 8712659795, డయల్ 100కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులకు పోలీస్ శాఖ క్యూ ఆర్ కోడ్‌లను అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు కృష్ణ చైతన్య, రాజేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్‌ఎంపీ ఆత్మహత్య

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన మోరె గణేశ్(38) అనే ఆర్‌ఎంపీ ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నవీన్ చంద్ర తెలిపారు. భార్యాభర్తల మధ్య చిన్నపాటి మనస్పర్థలతో మానసిక వేదనకు గురైన గణేశ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

రుద్రూర్: కోటగిరి మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన మేకల హన్మాండ్లు (30) చికిత్స పొందుతూ జిల్లా ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూలి పనులు చేస్తూ జీవించే హన్మాండ్లు అప్పులు పెరిగి పోవడంతో ఈ నెల 13న సాయంత్రం గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కెనాల్ కట్ట సమీపంలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, దేహంపై తెల్లటి రంగు టీషర్టు, కాకి కలర్ ప్యాంట్ ఉందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచామని, వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

స్నూకర్ షాపుపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్నూకర్ షాపుపై ఆదివారం అర్ధరాత్రి సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. ఈ షాపులో గత కొన్ని రోజుల నుంచి బెట్టింగ్ దందా సాగిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సీసీఎస్ పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 2,500 స్వాధీనం చేసుకొని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

బాల్కొండ: మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన మెండోరా మండల కేంద్రానికి చెందిన వేముల సాయిలుకు ఆర్మూర్ కోర్టు మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ సోమవారం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు బాల్కొండ ఎస్సై శైలెందర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



రంజిత్ (ఫైల్)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ఒడ్డెపల్లి రంజిత్ (29) బైక్‌పై అదుపుతప్పి పక్కనే ఉన్న డ్రైనేజీలో పడి మృతి చెందినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ సోమవారం తెలిపారు. ఒడ్డెపల్లి రాజలింగంకు నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కూతురుతోపాటు ఇద్దరు కొడుకులకు గతంలోనే పెళ్లిళ్లు జరిగాయి. మూడో వాడైన రంజిత్ 5 సంవత్సరాలుగా దుబాయ్‌కు వెళుతున్నాడు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొని వారం రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం బైక్‌పై బయటికి వెళ్లాడు. అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తూ గ్రామంలోని సీసీ రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న డ్రైనేజీలో పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు రంజిత్‌ను డిచ్‌పల్లిలోని ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున 3గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిమెంట్ బెంచ్ పైనుంచి పడి బాలుడు..

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో ప్రమాదవశాత్తు సిమెంట్ బెంచ్‌పై నుంచి పడి 5 నెలల బాలుడు మృతి చెందాడు. ఎస్సై శ్యాంరాజ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలూర్ మండలం దేగాం గ్రామానికి చెందిన బుడుబుక్కల పోసాని భిక్షాటన చేసేందుకు తన 5 నెలల కొడుకు శ్రీనుతో కలిసి ఆదివారం మధ్యాహ్నం నందిపేటకు వచ్చింది. గ్రామంలో భిక్షాటన అనంతరం రాత్రి ఆలస్యం కావడంతో నందిపేటలోని ఆర్టీసీ బస్టాండులో సిమెంట్ బెంచ్‌పై కొడుకుతో సహా నిద్రించింది. తెల్లవారుజామున 3 గంటలకు కాలకృత్యాలకు వెళ్లి తిరిగి వచ్చేలోపు బాలుడు బెంచ్ పైనుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అన్నారంలో కారు బోల్తా



కారును బయటకు తీస్తున్న స్థానికులు

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం అన్నారం శివారులో ఆదివారం రాత్రి మారుతి స్విఫ్ట్ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. నిజామాబాద్‌కు చెందిన యువకులు ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. అతి వేగంతో కారును నడపడంతో మూలమలుపు వద్ద రోడ్డు కనిపించక కారు వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అందులో ఉన్న యువకులకు స్వల్ప గాయాలు కాగా, పొక్లెయిన్ సాయంతో కారును బయటికి తీశారు. అన్నారం వద్ద మూల మలుపు కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. టిప్పర్లు, ఆటోలు బోల్తా పడిన ఘటనలున్నాయి. సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మరోవైపు పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టకపోవడంతో పలువురు వాహనాలను అతివేగంగా నడుపుతున్నారు.

పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసం



రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం స్కూల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఫర్నిచర్ ధ్వంసం చేశారు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల గది తాళాలు పగులగొట్టి సీలింగ్ ఫ్యాన్లు, వాటర్ బోర్ కేబుల్స్, ట్యూబ్ లైట్లు ధ్వంసం చేశారని హెడ్‌మాస్టర్ సాయికుమార్ తెలిపారు. సోమవారం ఉదయం పాఠశాలలోకి రాగానే చిందరవందరగా పడి ఉన్న వైర్లను చూసి అవాక్కయ్యారు. వాటర్ బోర్ కేబుల్స్, ట్యూబ్ లైట్లు, స్విచ్ బోర్డులు, సర్వీస్ వైర్ ధ్వంసమైనట్లు గుర్తించారు.

అక్రమ ఇసుక నిల్వల సీజ్



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి పరిధిలోని మొఘల్‌పుర శివారులో గోదావరి ఒడ్డుపై అక్రమంగా నిల్వ చేసిన ఇసుక నిల్వలను సోమవారం రెవెన్యూ అధికారులు, పోలీసులు సీజ్ చేశారు. మొఘల్‌పుర శివారులో సుమారు 300 ట్రాక్టర్ల ఇసుక నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. సీజ్ చేసిన ఇసుక నిల్వలను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తామని తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, రెంజల్ ఎస్సై చంద్రమోహన్ ఉన్నారు.